దాహం తీర్చుకుంటున్నయ్..



లక్ష్మణచాంద: ఎండల తీవ్రత కారణంగా రోజురోజుకూ చెరువులు, కుంటల్లో నీటిమట్టం తగ్గుతోంది. మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టిలో వీడీసీ ఆధ్వర్యంలో నిత్యం నీళ్లు నింపుతున్నారు. దీంతో గ్రామంలోని పశువులు అందులోని నీటిని తాగి దాహం తీర్చుకుంటున్నాయి.

వృథాగా భగీరథ జలం



లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలో డీ–16 కెనాల్ వద్ద భగీరథ పైపులైన్ వాల్వ్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో మూడు రోజులుగా నీరంతా వృథాగా రోడ్డుపైకి పోతుంది. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించరూ..



కుభీర్: మండలకేంద్రంలో వివేకానంద చౌరస్తా నుంచి కస్రా వైపు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. మోటారు రిపేరుషాపు నుంచి వృథా నీటిని రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు మహాపడిపూజ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నేడు (సోమవారం) అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో విషు మహాపడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బద్రి శ్రీనివాస్, కనపర్తి విగ్నేశ్ తెలిపారు. ప్రతి ఏటా చైత్ర బహుళ పాడ్యమి పురస్కరించుకొని నిర్వహించే ఈ కార్యక్రమం ఈసారి 15వసారి చేపడుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన అయ్యప్ప గురుస్వామి తోట శివశంకరరావు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి 11 వరకు పడిపూజ కార్యక్రమం, మధ్యాహ్నం అన్నదానం, భజన, భిక్ష, అల్పాహారం ఉంటుందని భక్తులూ హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. ఆదివారం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. దేగాం గ్రామానికి చెందిన సాయవ్వకు రూ.30 వేలు, ఎగ్గాం గ్రామానికి చెందిన లక్ష్మికి రూ.23 వేల విలువైన చెక్కులను కుటుంబీకులకు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, ఉత్తంబాలేరావ్, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, సాయిలు తదితరులు ఉన్నారు.

‘యువ వికాసం’ దరఖాస్తుకు గడువు పెంచాలి

నిర్మల్:రాష్ట్రప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చాలా మంది అర్హులకు కుల ధ్రువీకరణపత్రాలు అందుబాటులోకి రాలేవని.. వరుసగా సెలవులు వచ్చాయన్నారు. ఈమేరకు పథకానికి సంబంధించి దరఖాస్తు గడువు పెంచాలని ఆయన కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన జహీర్ అలీ కుమారుడు అఫ్నన్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కలీల్, ఇర్ఫాన్, గఫార్, సుమిత్, వాహబుద్దీన్ తదితరులు ఉన్నారు.

సమ్మేళనానికి జిల్లావాసులు



సమ్మేళనంలో పాల్గొన్న జిల్లావాసులు

నిర్మల్: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు దశ దిశ ఆత్మీయ సమ్మేళనంలో జిల్లావాసులు పాల్గొన్నారు. మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూసాల పోశెట్టి తదితరులు హాజరయ్యారు. హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని సమ్మేళనంలో పిలుపునిచ్చారు.

మజ్జిగ పంపిణీ

కుంటాల: మండలకేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయం వద్ద కుంటాలకు చెందిన రైతు ధోనిగామ శ్రీనివాస్ ప్రజలకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తో పాటు పర్వదినాల్లో మజ్జిగను పంపిణీ చే స్తున్న శ్రీనివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్ణం మారుతున్న మందారం



కడెం: మండల కేంద్రానికి చెందిన బొమ్మదళ గౌడ్ ఇంటి ఆవరణలో పూసిన మందారం ఆకట్టుకుంటోంది. ఏళ్లుగా లేత పసుపు రంగులో పూసిన మందారం.. ఈసారి ఎరుపు రంగులో పూసింది. ఒకే చెట్టుకు కొన్ని పూలు లేత పసుపు వర్ణంలో, మరికొన్ని పూలు ఎరుపు రంగులో పూయడంతో స్థానికులు వింతగా చూస్తున్నారు. జాంతోఫిల్ అనే వర్ణ ద్రవ్యం, జన్యు లోపంతో ఇలా పూలు పూస్తాయని లక్ష్మణచాందకు చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకుడు శ్రీనివాస్ పేర్కొన్నాడు.

సిగ్నల్ సమస్య తీరేనా!

- దౌనెల్లి, దౌనెల్లి తండా, గామాపూర్ తండాలో లేని సెల్‌టవర్లు
- సిగ్నల్ అందక ప్రజలకు ఇబ్బందులు
- సమాచారం తెలుసుకోలేక సతమతం



దౌనెల్లిలో గుట్ట ప్రాంతంలో ఫోన్‌లో మాట్లాడుతున్న గ్రామస్తులు

కుంటాల: ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్ ఉంటే సమాచారం క్షణాల్లో ఇట్టే తెలిసిపోతుంది. ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా తెలిసిపోయే ఈ రోజుల్లో ఆ గ్రామాలు వీటికి దూరంగా ఉన్నాయి. కుంటాల మండలంలోని దౌనెల్లి, దౌనెల్లి తండా, గామాపూర్ తండాల్లో సెల్‌టవర్లు ఏర్పాటు చేయలేదు. ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్నా.. చేరవేయాలన్నా..వారికి కష్టసుఖాలు తెలియాలన్నా అక్కడి ప్రజలకు ఇబ్బందిగా మారింది. సిగ్నల్ అందక విద్యార్థులు, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే యువకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రతీ ఇంటిపై ఎయిర్ ఫైబర్ బ్రాడ్ బ్యాండ్‌లు ఏర్పాటు చేసుకోక తప్పడం లేదు. దీనికి రూ.2 వేల నుంచి 2,500 వెచ్చించాల్సి వస్తోంది. ప్రతినెల రూ.700 చెల్లిస్తున్నా.. ఫలితం అంతంత మాత్రంగానే ఉందని పలువురు పేర్కొంటున్నారు.

గుట్ట ప్రాంతానికి వెళ్లాల్సిందే..

మండలంలోని దౌనెల్లి గ్రామం ఎత్తైన గుట్ట ప్రాంతంపై ఉంది. దౌనెల్లి తండా, గామాపూర్ తండా అనుబంధ గ్రామాలు. దౌనెల్లి పంచాయతీలో 2,150 జనాభాకు గాను 1283 మంది ఓటర్లు ఉన్నారు. దౌనెల్లి, దౌనెల్లి తండా, గామాపూర్ తండాలో సెల్ టవర్ ఏర్పాటు చేయలేదు. శివారులోని గుట్ట ప్రాంతానికి వెళ్లి ఫోన్ చేయాల్సిన పరిస్థితి. ఈ గ్రామం నుంచి ప్రతినిత్యం పైచదువుల కోసం విద్యార్థులు నిర్మల్, భైంసా, కల్లూరు, కుంటాల ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. సెల్ టవర్ లేక ఆన్‌లైన్ తరగతులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కోసం యువకులు దరఖాస్తులు చేసుకున్నా సెల్‌ఫోన్‌లో ఇంటర్నెట్ సమాచారం అందక కొలువులకు దూరం కావాల్సి వస్తోంది. సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు.

స్తంభిస్తున్న అత్యవసర సేవలు

దౌనెల్లి, దౌనెల్లి తండా, గామాపూర్ తండాలో సెల్ సిగ్నల్ రాక అత్యవసర సేవలు స్తంభిస్తున్నాయి. కనీసం 108 వాహనానికి సమాచారం ఇవ్వాలన్న సెల్ సిగ్నల్ అందని పరిస్థితి. ఫోన్లకు ఒకటి రెండు సిగ్నల్స్ రావాలన్న అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్లు ఎక్కి మరీ ఫోన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో సెల్‌సిగ్నల్ అసలే రాదు. గ్రామ పొలిమేరలో అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్లు ఎక్కితేనే ఫోన్ మాట్లాడవచ్చు. రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి వస్తుంది. సెల్‌టవర్ ఏర్పాటు చేయాలి.

– గంగాధర్, దౌనెల్లి

సమాచారం అందడం లేదు



సెల్‌ఫోన్ ఉన్నా ఫలితం లేకుండా ఉంది. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ తరగతులకు దూరమవుతున్నాం. ఉద్యోగాల కోసం ప్రభుత్వం నుంచి విడుదల చేసిన సమాచారం ఆలస్యంగా అందుతుంది.

– రవి, విద్యార్థి, దౌనెల్లి

బయటకు వెళ్లి ఫోన్ చేయాలి



తండాలో ఇంటి నుంచి బయటకు వెళ్లి ఫోన్ చేయాల్సి వస్తుంది. గంటల తరబడి సిగ్నల్ కోసం వేచి చూడాల్సి వస్తుంది. అనారోగ్యం బారిన పడితే సమాచారం ఇవ్వాలన్నా కష్టంగా మారింది.

– బుల్లిబాయి, దౌనెల్లితండా

ప్రతిపాదనలు పంపాం

దౌనెల్లిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. సెల్ టవర్ ఏర్పాటుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వారి ఆదేశాల మేరకు టవర్ ఏర్పాటుకు కృషి చేస్తాం.

– శర్మన్, డీఈ, బీఎస్ఎన్ఎల్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



లోకేశ్వరం : కన్కపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని అబ్దుల్లాపూర్, కన్కపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తప్ప,తాలు లేకుండా పంటను కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ‘ఏ’గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2320, ‘బీ’గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,300, సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 అదనంగా జమ చేస్తారని పేర్కొన్నారు. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్,బీజేపీ మండల కన్వీనర్ బొడికే సాయన్న, మంద భాస్కర్, దేవన్న, భోజారెడ్డి, ఏపీఎం మల్లేశ్, సీసీలు రాజేశ్వర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

ముధోల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని వడ్తాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పంటను ఆరబెట్టి విక్రయిస్తే మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంరావుపాటిల్ తదితరులున్నారు.

అలరించిన బండరాయి ఎత్తే పోటీలు

కుంటాల: గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగిన ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతి ఏటా హనుమాన్ జయంతి, మహాదేవుని పౌర్ణమి పురస్కరించుకుని కుంటాలలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే శనివారం అర్ధరాత్రి కుంటాల ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బండరాయి ఎత్తే పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. సుమారు120, 80 కేజీల బండ రాళ్ల ఎత్తే పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కుంటాలకు చెందిన జక్కుల గజేందర్, కొత్తకాపు పండరి, ఎల్లమ్మల గజేందర్ 120 కేజీల బండరాయిని అలవోకగా ఎత్తి కుంటాల బాహుబలులని నిరూపించుకున్నారు. 80 కేజీల బండరాయిని పలువురు యువకులు ఎత్తి సత్తా చాటారు. అనంతరం మహాదేవుని జెండాలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామస్తులు జెండాలకు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు జంగం మధు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



రాయి ఎత్తిన గజేందర్



రాయి ఎత్తిన పండరి

పెడదారి పడుతున్న యువత

ఖానాపూర్: జిల్లాలో కొందరు సైబర్‌మోసాల బారిన పడతుండగా.. మరికొందరు యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. ఇంకొందరు చిన్న వయసులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత నెల 25న పలువురు యువకులు ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు వెనకాల పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. తాజాగా ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన పాఠశాల విద్యార్థులు పేకాట ఆడుతూ పలువురి కంటబడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి యువత పెడదారి పట్టకుండా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఖానాపూర్‌లో పేకాట స్థావరంలో పేక ముక్కలు

అలరించిన వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వశిష్ఠ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్మించుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేశ్‌కుమార్ సింగ్, వైస్ ప్రిన్సిపల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



పొన్కల్‌లో రథోత్సవం

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథాన్ని అలంకరించి ఉత్సవమూర్తులతో ఊరేగించారు. తెల్లవారుజామున మొదలైన ఊరేగింపు ఉదయం 9 గంటల వరకు కొనసాగింది. గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆటవస్తువుల దుకాణాలు, మిఠాయిల దుకాణాలు వెలిశాయి.

స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు..

వేంకటేశ్వస్వామి హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించగా రూ.3.19లక్షలు సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



జెండావిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

భైంసారూరల్: మండంలలోని ఎగ్గాం గ్రామంలో ఆదివారం బీఆర్ అంబేద్కర్ జయంతి, బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, భూమేశ్, సాయినాథ్, దేవిదాస్, మహేందర్, నాగన్న, గణేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

జయంతి జరుపుకోవాలి

తానూరు: అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం అన్ని గ్రామాల్లో భారతీయ బౌద్ధమహాసభ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుకోవాలని భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు సురేకాంత్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. దళిత సంఘాల నాయకులు ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాలను తీసుకొస్తున్న భక్తులు

ముధోల్: మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మతల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం తెల్లవారుజామున బైండ్ల వారి సాయంతో పట్నాలను తొక్కించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ కాలనీల గుండా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం పలువురు భక్తులు ఎల్లమ్మ ఆలయానికి డప్పుచప్పుళ్లతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు వెంకటేశ్‌గౌడ్, మురళీగౌడ్, దేవేందర్‌గౌడ్, అంజిగౌడ్, సాయిబాబా గౌడ్, ప్రవీణ్‌గౌడ్, దత్తాత్రిగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు రయ్.. రయ్..!

- అనుమతుల్లేకుండా ఇసుక రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- భైంసాలో చోద్యం చూస్తున్న అధికారులు



పట్టణంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

భైంసాటౌన్: పట్టణంలోకి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. భైంసా మండలంలోని పలు గ్రామాల వాగుల నుంచి అనుమతుల్లేకుండా ఇసుకను తోడేస్తూ భైంసాలోని పార్డి(బి)బైపాస్ మార్గంలో, అదే చౌరస్తాలోని ఓ జిన్నింగ్ మిల్లు ఆవరణలో, రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో, ఇతర ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై నిత్యం ఉదయం, రాత్రి ఇసుక ట్రాక్టర్లు రయ్..రయ్ మంటూ పరుగులు పెడుతున్నాయి. లారీలు, టిప్పర్లలో నకిలీ లబ్ధిదారుల పేరిట ఇసుకను తీసుకొచ్చి డంప్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రాత్రి టిప్పర్లు, లారీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇలా నిత్యం అక్రమ ఇసుకదందా కొనసాగిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని



గాంధీనగర్‌లో మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో ప్రజా స్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గా భవాని అన్నారు. ఆదివారం పట్టణంలోని గాంధీనగర్ ఎస్సీ కాలనీలో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్, గాంధీ, పూలే వంటి మహనీయుల ఆలోచనలతో రూపుదిద్దుకున్న పవిత్ర గ్రంథం రాజ్యాంగం అని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ముసుగు గంగవ్వ, కలమడుగు శారద, మాదసు సురేఖ, నుస్రత్, చందన, తారాబాయి తదితరులు ఉన్నారు.